క్లుప్తంగా

భగవద్గీత, కృష్ణాష్టమి విశిష్టతలపై ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

గాజువాక: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భగవద్గీత, కృష్ణాష్టమి ఊరేగింపు విశిష్టతలపై మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రబోధ సమితి అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సభ్యులు శ్రీకృష్ణ భగవానుడికి మాత్రమే ఊరేగింపులను నిర్వహించాలని వివరిస్తూ త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాలపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు రమణ, రాజారావు, గణేష్, దేవి, మంగ, పద్మ, నాగమణి, శ్రేయ, లక్ష్మి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం



మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

సబ్బవరం: తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యమని ఐసీడీఎస్ సీడీపీవో లలిత కుమారి అన్నారు.మహిళా శిశు సంక్షేమ శాఖ,వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో మంగళవారం సబ్బవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి స్థానిక మూడు రోడ్ల కూడలి వరకూ భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతను,పోషకాలను తెలియజేసే విధంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.అనంతరం సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించారు. సీడీపీవో లలిత కుమారి మాట్లాడుతూ బిడ్డ పుట్టినప్పటి నుంచి కనీసం ఆర్నెల్ల పాటు తల్లి పాలు పెట్టాలన్నారు. దీని వల్ల పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి, మేధాశక్తి పెంపొందుతుందని చెప్పారు.పిల్లలకు రెండేళ్లు నిండే వరకూ తల్లిపాలతో పాటు అదనపు పోషకాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామ్మోహనరావు,ఈవోఆర్డీ మహేష్, ఏవో షేక్ బాబూరావు, సీహెచ్‌వో స్వర్ణలత, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు,అంగన్‌వాడీ కార్యకర్తలు,ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని ఆందోళన



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

సీతమ్మధార: రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఏఐఎస్ఎఫ్ విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వినూత్న రీతిలో కూరగాయలతో విద్యార్థులు ఆందోళన చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉల్లం నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లలో ప్రస్తుత ధరలకు అనుగుణంగా ప్రతి విద్యార్థికి రూ. 2,500 మెస్ చార్జీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలని, హాస్టళ్లలో ఖాళీగా ఉన్న వార్డెన్, కమాటి, ట్యూటర్, వాచ్‌మేన్, కుక్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. ప్రైవేట్ పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో 77 రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు. ఈ సమస్యలు పరిష్కరించని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని తెలిపారు. అనంతరం కలెక్టర్ ఎం.ఎన్.హరేందిరప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీను, జిల్లా సమితి సభ్యులు పాల్గొన్నారు.

వలంటీర్ల కథ ముగిసినట్టేనా..!

నిస్వార్థసేవకు నిలువెత్తు నిదర్శనం వలంటీర్లు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆవిర్భవించిన ఈ వ్యవస్థ అందరి మన్ననలు పొందింది. పింఛన్ల పంపిణీ నుంచి సర్టిఫికెట్ల అందజేత వరకు వలంటీర్లు ప్రజలకు తలలో నాలుకలా మెలిగారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ వారు అందించిన సేవలను ఎప్పటికీ మరువలేం. అంతటి సేవలందించిన వలంటీర్ల కొనసాగింపుపై సందిగ్ధత నెలకొంది.

- వాట్సాప్ గ్రూపుల నుంచి పేర్లు తొలగింపు
- విధులకూ పిలవని వైనం



ఆస్పత్రికి వెళ్లి అవ్వకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)



ఇంటికి వెళ్లి వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

గాజువాక: ప్రతీ నెలా ఒకటో తేదీ రాగానే ఠంచన్‌గా ఇంటికి వచ్చి, అవ్వాతాతలకు పెన్షన్ అందించే వలంటీర్లు కనిపించరా.. కుల, ఆదాయ, నివాస సర్టిఫికెట్ల కోసం ఇళ్లకు వచ్చి దరఖాస్తులు తీసుకునే ఆ సేవకులు ఇకపై ఉండరా.. ప్రభుత్వ పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నా.. ప్రభుత్వం నుంచి ఏ సహాయానికైనా అండగా నిలిచే వలంటీర్లు ఇక లేనట్టేనా.. మొత్తానికి వారి కథ ముగిసినట్టేనా.. ఈ ప్రశ్నలకు అవును అనే సమాధానమే వస్తోంది అధికారుల తాజా చర్యలతో.

తాము అధికారంలోకి వస్తే వలంటీర్ల జీతాన్ని రూ.10వేలకు పెంచుతామని హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత మాట మార్చేసిన పరిస్థితి తేటతెల్లమైంది. వలంటీర్ల జీతం పెంపుదల విషయం అటుంచితే, వారిని విధులకు పిలవకపోగా ఇప్పుడు వారిని అన్ని గ్రూపుల నుంచి తొలగించాల్సిందిగా ఉన్నతాధికారుల నుంచి స్థానిక అధికారులకు ఆదేశాలందాయి. దీంతో వారు తమ పరిధిలో ఉన్న అన్ని గ్రూపుల నుంచి వలంటీర్లను తొలగించారు.

20 వార్డులతో ఉన్న గాజువాక జోన్‌లోనే 1864 మంది వలంటీర్లు పని చేస్తున్నారు. మొత్తం 108 వార్డు సచివాలయాల పరిధిలో వారి సేవలు కొనసాగుతున్నాయి. ఇటీవల నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వివిధ పరిణామాల నేపథ్యంలో వలంటీర్ల సేవలను తాత్కాలికంగా ప్రభుత్వం నిలిపివేసింది. ఎన్నికల అనంతరం వారి సేవలను తిరిగి ప్రారంభిస్తామని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చెప్పిన విషయం తెలిసిందే. అయితే, ప్రస్తుతం అధికారంలో ఉన్న చంద్రబాబు మాత్రం వారిని విధుల్లోకి తీసుకోవడంలేదు. తమను విధుల్లోకి తీసుకుంటారని వలంటీర్లు ఎదురు చూస్తున్న పరిస్థితుల్లో వారిని వాట్సాప్ గ్రూపుల నుంచి తొలగించాల్సిందిగా ఉన్నతాధికారులనుంచి ఆదేశాలందాయి. దీంతో వారు వలంటీర్ల గ్రూపులన్నింటినీ తొలగించారు. ఒక్కో సచివాలయం పరిధిలో 10 నుంచి 15 వరకు వలంటీర్లకు సంబంధించిన వాట్సాప్ గ్రూపులున్నాయి. ప్రస్తుతం అధికారులు వాటన్నింటినీ తొలగించారు.

> **ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..**
>
> వలంటీర్లను గ్రూపుల తొలగించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలొచ్చాయి. ఇది రాష్ట్రమంతటా జరిగింది. ఉన్నతాధికారుల ఆదేశాలనే గాజువాక జోన్‌లో కూడా సంబంధిత అధికారులు, సిబ్బంది అమలు చేశారు.
>
> –బి.సన్యాసినాయుడు, గాజువాక జోనల్ కమిషనర్, జీవీఎంసీ

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు స్పందన



రిపోర్టులను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

గాజువాక: గాజువాక పీహెచ్‌సీ సిబ్బంది, హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి సిబ్బంది ఆధ్వర్యంలో స్థానిక దిబ్బపాలెం పునరావాస కాలనీలో మంగళవారం క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించారు. శ్రీరామ్ నగర్ సుందరయ్య కాలనీ–2 సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 30 ఏళ్ల దాటిన మహిళలకు బ్రెస్ట్‌కి సంబంధించిన కాయలు ఉన్నవారికి, వైట్ డిశ్చార్జి, ఇన్ఫెక్షన్స్ ఉన్నవారికి ఓవరాల్ క్యాన్సర్‌కి సంబంధించిన పరీక్షలను నిర్వహించారు. డాక్టర్ నమిత ఆధ్వర్యంలో టెక్నీషియన్లు ఈ పరీక్షలను నిర్వహించారు. శిబిరంలో 61 మంది మహిళలకు క్యాన్సర్ పరీక్షలను నిర్వహించామని, అందులో పది మందిని క్యాన్సర్ అనుమానితులుగా నిర్ధారించామని గాజువాక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.సుధాకర్ రావు తెలిపారు. కన్ఫర్మేషన్ కోసం వారి రిపోర్టులను సిఫార్సు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్యాన్సర్ ఆస్పత్రి ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ కె.కృష్ణంరాజు, గాజువాక పీహెచ్‌సీ సీహెచ్‌వో పి.నాగ అప్పారావు, హెల్త్ సూపర్‌వైజర్ జి.రాము, ఏఎన్ఎం నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ మూలకు చేరిన లిఫ్ట్

మూడు వారాలకే మొరాయింపు



దువ్వాడ రైల్వేస్టేషన్‌లో మూత పడని లిఫ్ట్ డోర్

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో లిఫ్ట్ మళ్లీ మూలకు చేరింది. తరచూ సాంకేతిక కారణాల వల్ల లిఫ్ట్ పాడవడంతో రైల్వే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. నాలుగో నంబర్ ప్లాట్‌ఫాం నుంచి ఒకటో ప్లాట్‌ఫాం వైపు వెళ్లేందుకు ప్రయాణికులు లగేజీలతో, వృద్ధులు.. పిల్లలతో మెట్ల మార్గంలో ఇబ్బంది పడుతుండేవారు. దీంతో 8 మాసాల క్రితం లిఫ్ట్‌ను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత 15 రోజులకే మరమ్మతులకు గురవడం మొదలు.. ప్రతీ రెండు మూడు వారాలకు ఒకసారి మొరాయిస్తోంది. ఇప్పుడు కూడా గత ఆదివారం నుంచి కూడా లిఫ్ట్ డోర్ మూతపడకపోవడంతో లిఫ్ట్ పని చేయడం ఆగిపోయింది. తరచూ ఇదే పరిస్థితి తలెత్తడంతో ప్రయాణికులు విసిగిపోతున్నారు. అధికారులు స్పందించి తక్షణం మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

అందరి శాంతిని ఆకాంక్షించాలి



కణితి హైస్కూల్ విద్యార్థులతో శాంతి ప్రతిజ్ఞ చేయిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

అగనంపూడి: ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ, నేను శాంతిగా ఉంటూ, అందరి శాంతిని కోరుకుంటానని విద్యార్థులు భావించిననాడు అహింసకు తావు లేకుండా, అశాంతికి అవకాశం లేకుండా ప్రశాంత జీవనం సాగించేందుకు వీలు కలుగుతుందని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎ.మురళీధర్‌రెడ్డి అన్నారు. హిరోషిమా డే సందర్భంగా లయన్స్‌క్లబ్ కూర్మన్నపాలెం ఆధ్వర్యంలో కణితి, నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని 17వందల మంది విద్యార్థులతో శాంతి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ జపాన్ దేశంలోని హిరోషిమా, నాగసాకిలపై అణుబాంబు ప్రయోగం వల్ల కలిగిన విస్ఫోటనం గురించి ప్రతీ విద్యార్థికి తెలియజేయాలన్నారు. వాటి వల్ల కలిగిన నష్టం, నేటికీ అక్కడి ప్రజలు అనుభవిస్తున్న బాధలను విద్యార్థులకు వివరించగలిగితే హింసకు దూరంగా ఉంటారనే ఒక నమ్మకం అన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా వైస్ గవర్నర్, కె.వి.సుబ్బరాజు, లయన్ కె.ప్రసాద్ నాయుడు, లక్ష్మా రెడ్డి, ఎస్.శ్రీనివాసరావు, కె.వి.ప్రసాద్, కణితి హైస్కూల్ హెచ్ఎం ప్రకాశరావు, పీడీ మన్నాజీ, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో సైబర్ నేరాలకు చెక్

క్రైం ఏసీపీ శ్యామలరావు



మాట్లాడుతున్న క్రైం ఏసీపీ శ్యామలరావు

పెందుర్తి: ప్రస్తుతం సాంకేతికతను వినియోగించుకుని సైబర్ నేరాలకు పాల్పడుతున్న వ్యక్తులపై ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జోన్–2 క్రైం విభాగం ఏసీపీ శ్యామలరావు అన్నారు. ఆర్ఆర్ వెంకటాపురం సమీపంలోని అశ్వార్‌దాస్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులంతా సైబర్ నేరాలపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. తెలియని నంబర్ల నుంచి ఫోన్ వచ్చినా.. బ్యాంకు ఖాతా ఇతర వివరాలు అడిగినా తెలియజేయవద్దన్నారు. విద్యార్థి దశలో చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి వినియోగం, రవాణా జీవితాలను నాశనం చేస్తుందన్నారు. సమాజంలో గుర్తింపు కావాలంటే చక్కటి నడవడిక అవసరమని చెప్పారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే అనుకున్న లక్ష్యాలను అలవోకగా చేరుకుంటారని పేర్కొన్నారు. వెస్ట్ జోన్ క్రైం విభాగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, పెందుర్తి క్రైం విభాగం సబ్ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పీఎఫ్ సొమ్ముపై ఆర్ఐఎన్ఎల్, ఆర్‌సీఎల్ దోబూచులాట

బాధితుడు శరగడం రామారావు ఆవేదన



మాట్లాడుతున్న శరగడం రామారావు, పక్కన రామ అప్పారావు

అగనంపూడి: విశాఖ ఉక్కులో సుమారు 29 ఏళ్ల పాటు ఒప్పంద కార్మికునిగా విధులు నిర్వర్తించానని, అయితే తన జీతం నుంచి మినహాయించిన పీఎఫ్ సొమ్ము విషయంలో ఉక్కు యాజమాన్యానికి సంబంధం లేదని ఆర్‌సీఎల్ అధికారుల తేల్చిచెప్పడం అన్యాయమని బాధితుడు శరగడం రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. అగనంపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తనను విధుల నుంచి తప్పించకముందు తన జీతం నుంచి పీఎఫ్ కోసం మినహాయించేవారని, ఆ మొత్తాన్ని పీఎఫ్ ఖాతాను జమచేయాల్సి ఉందని చెప్పారు. తనతో వెట్టి చాకిరీ చేయిస్తున్న విషయాన్ని నిలదీయడంతో తనను అన్యాయంగా తొలగించారని ఆరోపించారు. తరువాత తాను పింఛన్ కోసం పీఎఫ్ విభాగాన్ని సంప్రదిస్తే ఉక్కు కర్మాగారం నుంచి కోత విధించిన మొత్తం డబ్బులు రాలేదని చెప్పడంతో ఆర్‌సీఎల్‌కు ఫిర్యాదు చేశానన్నారు. ఆర్ఐఎన్ఎల్ అధికారుల నోటి మాటలే ఆర్‌సీఎల్ పలకడం చూస్తుంటే ఉక్కు, పీఎఫ్, ఆర్‌సీఎల్ అధికారులు కుమ్మక్కై తనకు అన్యాయం చేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎస్‌డబ్ల్యూ యూనియన్ ప్రధాన కార్యదర్శి పట్టా రామ అప్పారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి మొబైల్ టెక్నీషియన్ల సమస్యలు



ఎమ్మెల్యే పల్లాకు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

గాజువాక: విచారణ పేరుతో మొబైల్ టెక్నీషియన్లపై పోలీసుల వేధింపులు ఆపాలని గాజువాక మొబైల్ టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం నిర్వహించిన ఒక సమావేశంలో అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. మొబైల్ యూజర్లు రిపేరు నిమిత్తం తమ షాపులకు వచ్చి ఫోన్లను ఇస్తుంటారని, వాటిని చెక్ చేయడానికి అందులో తమ సిమ్ కార్డులను వేసి పరిశీలిస్తుంటామని పేర్కొన్నారు. తమ వద్దకు వచ్చే మొబైల్ ఫోన్లు వారి సొంతమా, దొంగిలించి తీసుకొచ్చారా అనే విషయాలు తమకు తెలియవన్నారు. రిపేరు తరువాత అందులో తమ సిమ్ కార్డు వేసి, చెక్ చేసిన తరువాత కస్టమర్లకు డెలివరీ ఇస్తామని తెలిపారు. కొన్ని రోజుల తరువాత పోలీసులు తమకు కాల్ చేసి విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్లకు పిలిచి ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. స్వయం ఉపాధి నిమిత్తం మొబైల్ ఫోన్ల సర్వీస్‌లను చేస్తుంటామని, తమకు ఎటువంటి సంబంధం లేకపోయినా వేధింపులను ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. వివిధ ఇతర సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. వినతి పత్రం అందజేసినవారిలో అసోసియేషన్ సభ్యులు వేణుగోపాల్, హేమసుందర్‌రావు తదితరులున్నారు.

'సంఘం శరణం గచ్ఛామి' పోస్టర్ ఆవిష్కరణ

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం, అభ్యుదయ ఆర్ట్స్(హైదరాబాద్) సంయుక్తంగా ప్రదర్శించనున్న సంఘం శరణం గచ్ఛామి–డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర నాటక ప్రదర్శన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఏయూ డాక్టర్ బీఆర్.అంబేద్కర్ అసెంబ్లీ హాల్ వేదికగా ఈ నాటక ప్రదర్శన జరుగుతుందని పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య పేటేటి ప్రేమానందం తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కిశోర్‌బాబు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వి.ఆర్.రాజు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, డాక్టర్ జి.వీర్రాజు, డాక్టర్ జి.కె.డి.ప్రసాద్, డాక్టర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నిరంతర సాధనతో రాణింపు

పెందుర్తి: సాంకేతిక రంగంలో రాణించాలంటే నిరంతర సాధన అవసరమని జిల్లా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అన్నారు. పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 'ఐవోటీ–సెన్సార్స్' అంశాలపై రెండు రోజుల పాటు నిర్వహించనున్న వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లను ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. పలు అంశాలపై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మెసెస్స్ సంస్థ ప్రతినిధి టి.సూర్యస్వరూప్, ఈసీఈ హెచ్‌వోడీ డాక్టర్ ఎం.నాగమణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌కు సహకరించండి



మాట్లాడుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ తాతారావు

పెదగంట్యాడ: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖను నంబర్ వన్‌గా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని 76వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వై. తాతారావు కోరారు. జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని నడుపూరు వాసవి వీధిలో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ శుభ్రత పాటిస్తే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. ఇళ్లలోని చెత్తను రోడ్లు, కాలువల్లో వేయవద్దని, ప్రతి రోజూ ఇంటి వద్దకు వచ్చే పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని సూచించారు. ఇంట్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, డ్రమ్ములు, కుండీలపై మూతలు ఉంచాలని తెలిపారు. ఇంటి సమీపంలో వాడిపడేసిన కొబ్బరి బొండాలు, టైర్లు, ట్యూబుల వంటివి లేకుండా చూసుకోవాలన్నారు. వాటిలో నీటి నిల్వల కారణంగా దోమలు వృద్ధి చెందుతాయని తద్వారా మలేరియా, డెంగ్యూ వంటి రోగాలను వ్యాప్తి చేస్తాయని వివరించారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పొడిగా, పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. వారంలో ఒకరోజు డ్రైడే పాటించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ సిబ్బంది హేమ, సాయిశ్రీ, రమణ, గ్రామస్తులు బొడ్డు కృష్ణారావు, ప్రసాద్, వర్ధన్, బెల్లాల సతీష్‌కుమార్, కమల, లక్ష్మి, గీతాబాల తదితరులు పాల్గొన్నారు.

ఉక్కుపై కేంద్రం సానుకూలంగా స్పందించాలి

- ఇంటక్ రాష్ట్ర కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం
- 1272వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు



సంఘీభావం తెలుపుతున్న ఇంటక్ రాష్ట్ర కార్యదర్శి భోగవల్లి నాగభూషణం

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ చైర్మన్లు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ, ఇంటక్ రాష్ట్ర కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న రిలే దీక్షల్లో 1272వ రోజు, మంగళవారం వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించిన కేంద్ర మంత్రి కుమారస్వామి సానుకూలంగా వ్యవహరించడంతో, ఆయన వచ్చి వెళ్లిన తరువాత ప్రవేశపెట్టే బడ్జెట్‌లో సానుకూలత ఉంటుందని భావించామన్నారు. అయితే, అందుకు భిన్నంగా ఉండడంతో కార్మికులు, ఉద్యోగులు ఆందోళన చెందారన్నారు. ప్రైవేటీకరణ జరగదనే ప్రకటన కోసం యావత్ ఆంధ్ర ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వామ్య పక్షాలుగా ఉన్న టీడీపీ, జనసేనలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నారు. దీక్ష శిబిరంలో ఇంటక్‌కు చెందిన వివిధ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. నాయకులు నీరుకొండ రామచంద్రరావు, బీఎస్ రాజు, జీవీ సుబ్బయ్య, కొవిరి అవతారం, సుబ్బారావు, రవి, దుర్గా ప్రసాద్, ఎంవీఎస్ ప్రసాద్, ప్రభాకర్‌రెడ్డి, వేణువర్మ, గంగవరం గోపి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ నాయకుల డిమాండ్
- 13న 'చలో అడ్మిన్'



ఆర్ఎంహెచ్‌పీ విభాగాధిపతి కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ సంఘం నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్, ఆర్ఎంహెచ్‌పీ, సీఆర్ఎంపీ, సింటర్ ప్లాంట్, టీపీపీ, బీఎఫ్ విభాగాధిపతుల కార్యాలయాల వద్ద మంగళవారం ధర్నా చేశారు. ధర్నాలో నాయకులు మాట్లాడుతూ కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించాలన్నారు. ఈఎస్ఐ లేని కార్మికులకు వైద్య సౌకర్యం యాజమాన్యమే కల్పించాలని, ఎన్‌జేసీఎస్‌లో పెంచిన వేతనాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల తొలగింపు ఆలోచన విరమించుకోవాలన్నారు. ఈ అంశాలపై ఈ నెల 13న చలో అడ్మిన్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. వెంటనే కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఒ.వి.రావు, నమ్మి రమణ, జి.శ్రీనివాసరావు, కె.ఎం.శ్రీనివాస్, సీహెచ్.నర్సింగరావు, కన్నబాబు, శశిభూషణ్, కె.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

సైకాలజీ ఇంటర్నల్ ప్రాక్టికల్స్ పరిశీలన



ఇంటర్నల్ ప్రాక్టికల్స్ పరిశీలిస్తున్న ఏయూ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ఎం.వి.ఆర్.రాజు

విశాఖ సిటీ: ఏయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్ ద్వితీయ సంవత్సరం మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ సైకాలజీ ఇంటర్నల్ ప్రాక్టికల్‌ను కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు మంగళవారం వ్యాయామ విద్యా విభాగంలో పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. త్వరలో తాను సైకాలజీ తరగతి తీసుకుంటానని తెలిపారు. పాస్ ఎలాంగ్ టెస్ట్, కైనెస్థీషియోమెట్రిక్ టెస్ట్, టాచిస్టోస్కోప్ టెస్ట్, ఫింగర్ డెక్స్‌టిరిటీ టెస్ట్, రియాక్షన్, రెస్పాండ్ టెస్ట్‌ల విధానాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు పరీక్షా విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా వ్యాయామ విద్యా విభాగం హెడ్ ఆచార్య ఎ.పల్లవి, ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎస్.విజయమోహన్, సైకాలజీ ఫ్యాకల్టీ జయరాం, వ్యాయామ విద్యా విభాగం పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ పక్కాగా జరగాలి



అధికారులను ఆదేశిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

డాబాగార్డెన్స్: ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ పక్కాగా జరగాలని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మంగళవారం జోన్–4 పరిధి 28వ వార్డు రామ్‌నగర్, నెహ్రూనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నివాసిత ప్రాంతాల్లో ప్రతిరోజూ క్లాప్ వాహనాల ద్వారా చెత్త సేకరించాలని, కాల్వల్లో నిత్యం వ్యర్థాలను తొలగించి, మురుగునీరు సాఫీగా పోయేలా చూడాలని జోనల్ కమిషనర్ ప్రసాదరావును ఆదేశించారు. వాణిజ్య సముదాయాలు, దుకాణదారులు కాల్వల్లో చెత్త వేయకుండా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకుని జీవీఎంసీ చెత్త తరలించే వాహనానికి నేరుగా అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లు, కాల్వలు, బహిరంగ ప్రదేశాల్లో నివాసితులు వ్యర్థాలు వేయకుండా వారంలో ఒకసారి ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించాలని, కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోయినందున దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ తదితర విష జ్వరాలు, వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, అందుకు కాల్వల్లో పూడికలతో పాటు ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయించాలన్నారు. నెహ్రూనగర్ దోబీఖానాను ఆనుకుని ఉన్న ప్రధాన కాల్వలో వ్యర్థాలు అధికంగా ఉన్నాయని, వారంలో ఒకరోజు కాల్వలో పూడికలు తొలగించాలని ఏఎంవోహెచ్ డాక్టర్ రాజేష్‌ను కమిషనర్ ఆదేశించారు. నెహ్రూనగర్ ప్రధాన కాల్వను ఆనుకుని ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి పిల్లర్లకు మరమ్మతులు చేపట్టాలని, కాలువలపై ఉన్న పలకలు పూర్తిగా మూసివేయకుండా చెత్త తీసేందుకు వీలుగా పలకలు అమర్చాలని కార్యనిర్వాహక ఇంజినీరు సంతోషిని ఆదేశించారు. పలు చోట్ల కాలువల గుండా తాగునీటి పైపులను గుర్తించి మంచినీటి పైపుల్లోని నీరు కలుషితం కాకుండా నీటిపైపులు క్రమపద్ధతిలో మార్పు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఝాన్సీలక్ష్మి, టీపీవో వినయ్‌ప్రసాద్, సహాయ ఇంజినీర్ జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.